## హెచ్ఎండీఏ పరిధిలో..
## బ్లూ గ్రీన్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ప్లాన్

- చెరువులు, పచ్చదనంపై మాస్టర్ ప్లాన్ రూపకల్పన
- నోటిఫికేషన్‌ను జారీ చేసిన హెచ్ఎండీఏ
- ఈ నెల 16 వరకు కన్సల్టెన్సీల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణే లక్ష్యంగా హెచ్ఎండీఏ పనిచేస్తున్నది. నగర శివారు ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అధిక ప్రాధాన్యతనిస్తూ.., ఇప్పటికే అమలులో ఉన్న హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్-2031కు అనుగుణంగా అభివృద్ధి కార్యకలాపాలను నిర్వహిస్తున్నది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత హైదరాబాద్ మహానగరం ఎవరూ ఊహించని విధంగా ఔటర్ రింగు రోడ్డు దాటి విస్తరిస్తున్నది. ఈ నేపథ్యంలో పట్టణీకరణకు అనుగుణంగా, పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా జీవ వైవిధ్యానికి ప్రాధాన్యతనిస్తూ హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్ పరిధిలో బ్లూ గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లాన్ రూపకల్పనకు హెచ్ఎండీఏ శ్రీకారం చుట్టింది. ప్రధానంగా స్పష్టమైన కాంటూర్ సర్వే, పట్టణ వరద నిరోధక ప్రణాళికతో సహా రీజియన్ మాస్టర్ ప్లాన్ రూపకల్పన, ప్రస్తుత జలాశయాలను గుర్తించడం, గ్రీన్ పబ్లిక్ స్పేస్‌లు, అర్బన్ ఫారెస్ట్, లేక్ ఫ్రంట్స్, రివర్ ఫ్రంట్స్, కెనాల్ ఫ్రంట్స్ వంటి వాటి ఏర్పాటుకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఈ ప్రణాళిక రూపొందించేందుకు కన్సల్టెన్సీలను నియమించనున్నది. ఇప్పటికే అమలులో ఉన్న మాస్టర్ ప్లాన్ తప్పుల తడకగా ఉన్నదనే అభిప్రాయం ఉన్నందున అత్యంత కీలకమైన రెండు అంశాలైన చెరువులు, పచ్చదనంపై 7257 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న హెచ్ంఎడీఏ పరిధిలో దీన్ని రూపొందించాలని హెచ్ఎండీఏ నిర్ణయించింది. 2050 నాటికి పెట్టుబడి కార్యక్రమాలు, పట్టణ పరివర్తన సాధించడానికి, నివాసితుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు ఈ ప్రణాళిక సమగ్రంగా రూపొందించాల్సి ఉంది. ఈ ప్రణాళిక రూపకల్పనకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సోమవారం అధికారులు జారీ చేశారు. ఈ నెల 16వ తేదీ వరకు ఆసక్తిగల కన్సల్టెన్సీలు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఆ తర్వాత కన్సల్టెన్సీలను ఎంపిక చేసిన బ్లూ గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లాన్‌కు రూపకల్పన చేసే బాధ్యతలను అప్పగించనున్నారు.

## షాపింగ్ మాల్స్‌లో గ్రామీణ జానపద నృత్యాలు



సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): గ్రామీణ జానపద నృత్యాలు ఆకట్టుకుంటున్నాయని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ అన్నారు. సోమవారం జీవీకే మాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు మనం ఫ్లాష్ మాబ్ కార్యక్రమాల గురించే విన్నామని, ఇక నుంచి ఫ్లాష్ ఫోక్ కార్యక్రమాలను కూడా ఆస్వాదించాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. తెలంగాణ జానపద కళారూపాలను పలు షాపింగ్ మాల్స్ వద్ద ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు.

## వాయిస్ రంగంలో విస్తృత అవకాశాలు

### భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ



జూబ్లీహిల్స్, అక్టోబర్ 2: మాటలను సందర్భానుసారం పలికించగలిగే స్వరం ఒక వరమని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ పేర్కొన్నారు. సురభి కళాక్షేత్రం నిర్వహణలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ లిటరసీ హౌస్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో జరిగిన వాయిస్ అండ్ స్పీచ్ వర్క్‌షాప్ సీజన్-3 ముగింపు వేడుకలకు మామిడి ముఖ్య అతిథిగా హాజరై వాయిస్ అండ్ స్పీచ్ వర్క్‌షాప్ సీజన్-4 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా రేడియో రిటైర్డ్ ఏడీ సీఎస్ రాంబాబు, ప్రముఖ రంగస్థల నటుడు, వాయిస్ అండ్ స్పీచ్ ట్రైనర్ ఆర్‌జే డాక్టర్ సురభి రమేశ్, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ లిటరసీ హౌస్ డైరెక్టర్ కంచర్ల లక్ష్మి, లైఫ్ మేనేజ్‌మెంట్ కోచ్ డాక్టర్ సాయి ఆచార్య, ఆర్జే స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

# కొత్త.. కొత్తగా.. పాతనగరం

### పాత నగరాన్ని పట్టించుకోని నాటి ప్రభుత్వాలు

- బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి పరుగులు
- మెట్రో రైలు, మూసీపై వంతెనలు, ఫ్లై ఓవర్ల ఏర్పాటుతో మెరుగైన రవాణా సౌకర్యం
- మలక్‌పేటలో ఐటీ టవర్ నిర్మాణంతో మారనున్న రూపురేఖలు
- ఐటీ టవర్ నుంచి మూసారాంబాగ్ మెట్రో స్టేషన్ వరకు స్కైవాక్
- 50వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



మలక్‌పేటలో ఐటీ టవర్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి కేటీఆర్

సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు అనేక ప్రభుత్వాలు మారినా పాతబస్తీ రూపు రేఖలు మారలేదు. హైదరాబాద్‌కు ఐటీ తెచ్చింది నేనే అని చెప్పుకునే టీడీపీ ప్రభుత్వం సైతం దశాబ్ద కాలం అధికారంలో ఉండి పాతబస్తీకి చేసింది ఏమీలేదు. అలాంటిది ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం పాతబస్తీ అభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించి ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నది. తాజాగా మలక్‌పేటలో 10.35ఎకరాల విస్తీర్ణంలో చేపట్టనున్న ఐటీ టవర్ నిర్మాణం పాతబస్తీకి ఆధునిక ఆభరణంగా మారనున్నది. సుమారు రూ.700 కోట్ల వ్యయంతో 21 అంతస్థులతో 20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐటెక్ న్యూక్లియస్ పేరుతో ఐటీ టవర్‌ను నిర్మిస్తున్నారు. 36 నెలల్లో పూర్తి చేసేలా కార్యాచరణను సైతం సిద్ధం చేశారు. నిర్మాణ పనులకు సోమవారం (గాంధీ జయంతి రోజున) రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు, హైదరాబాద్ పార్లమెంటు సభ్యులు అసదుద్దీన్ ఒవైసీతో కలిసి శంకుస్థాపన చేశారు. మొక్కుబడిగా కాకుండా ఎంతో వ్యూహాత్మకంగా మలక్‌పేటలో సుమారు 40 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని అధికారులు గుర్తించారు. అందులో మొదటి దశలో 10.35 ఎకరాల్లో ఐటీ టవర్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భవిష్యత్తులో మరింతగా విస్తరించేందుకు అవసరమైన స్థలాన్ని సైతం సిద్ధం చేసి ఉంచింది. దీంతో ఈ ప్రాంతంలో అభివృద్ధితో పాటు ఇక్కడి ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. ఈ ఒక్క ఐటీ టవర్ నిర్మాణం పూర్తయితే ఐటీ, ఐటీఈఎస్ విభాగాల్లో సుమారు 50వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు దక్కనున్నాయి.

> **పాత బస్తీ పేరు వింటేనే నాటి ప్రభుత్వాలు పరుగులు పెట్టాయి. అనేక ప్రభుత్వాలు మారినా అక్కడ అభివృద్ధి పనులు చేపట్టేందుకు సాహసం చేయలేదు. దీంతో పాతనగరంలో అభివృద్ధి కుంటుపడింది. కానీ ఎన్నికల ముందు సీఎం కేసీఆర్ పాతబస్తీలో సకల వసతులు కల్పించి కొత్త బస్తీగా మార్చేస్తానని చెప్పిన మాట ప్రకారం ముందుకు కదిలారు. రోడ్లను విస్తరించడంతో పాటు ఫ్లై ఓవర్లు నిర్మించి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచారు. మెట్రోను కూత పెట్టించడంతో పాటు మూసీపై వంతెనలు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. అంతేకాకుండా ఐటీ టవర్ ఏర్పాటుతో పాత నగరానికి కొత్త అందాలను తీసుకువస్తున్నారు.**

### నలుదిశలా ఐటీ రంగం విస్తరణ

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత నుంచి హైదరాబాద్‌లో ఐటీ రంగం ఆకాశమే హద్దుగా అన్నట్లుగా అభివృద్ధి చెందింది. అయితే ఐటీ రంగమంతా నగరానికి ఒకవైపే కాకుండా నగరం నలుమూలలా విస్తరించేందుకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా కసరత్తు చేశారు. పడమర దిక్కుతో పాటు తూర్పు, దక్షిణం, ఉత్తరం దిక్కుల్లోనూ ఐటీ రంగం విస్తరించేలా ఐటీ, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందించారు. ఇప్పటికే ఉత్తరం దిక్కులో మేడ్చల్-కండ్లకోయ వద్ద ఒక ఐటీ పార్కును నిర్మిస్తున్నారు. అదేక్రమంలో కోర్ సిటీగా ఉన్న పాతబస్తీలోని మలక్‌పేటలో ఐటీ రంగం విస్తరించేందుకు చర్యలు చేపట్టింది. కేవలం ఐటీ టవర్‌ను నిర్మించడమే కాకుండా దానికి సమీపంలో ఉన్న మూసారాంబాగ్ మెట్రో స్టేషన్ నుంచి మలక్‌పేట ఐటీ టవర్ వరకు స్కైవాక్‌ను నిర్మించనున్నామని మంత్రి కేటీఆర్ ప్రకటించారు. ప్రస్తుతం ఐటీ కారిడార్‌లో ఉన్న మౌలిక వసతులను మలక్‌పేట ఐటీ టవర్ చుట్టు పక్కల ప్రాంతాల్లో కల్పించనున్నారు. ఒకప్పుడు మలక్‌పేట అంటే టీవీ టవర్ అని ఠక్కున గుర్తుకు వచ్చేది. అలాంటి టీవీ టవర్‌ను మర్చిపోయేలా 21 అంతస్థులతో అత్యాధునిక ఐటీ టవర్ నిర్మాణం మలక్‌పేటకు మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురానున్నది.

### మూసీ సుందరీకరణతో పాతబస్తీకి కొత్త రూపం

ఐటీ టవర్ నిర్మాణంతో పాటు పాతబస్తీలో భాగంగా ఉన్న మూసీనది సుందరీకరణ కోసం భారీ ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేసింది. గండిపేట, హిమాయత్‌సాగర్ నుంచి మొదలయ్యే మూసీ, ఈసీ నదులపై 14 చోట్ల చారిత్రాత్మక హైదరాబాద్ నేపథ్యంలో బ్రిడ్జిలు నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేయగా, అందులో 7 బ్రిడ్జిల నిర్మాణానికి ఇటీవలే శంకుస్థాపన చేశారు. అందులో ఒకటి మూసారాంబాగ్ వద్ద మూసీ నదిపై ఒక హైలెవల్ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. ఈ బ్రిడ్జిలే కాకుండా మూసీ పొడవునా సుమారు 56 కి.మీ పొడవునా ఈస్ట్-వెస్ట్ కారిడార్‌ను సైతం సుమారు రూ.10వేల కోట్లతో నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఎంజీబీఎస్ వరకే వచ్చి ఆగిన మెట్రో రైలును పాతబస్తీలోని ఫలక్‌నుమా వరకు వెంటనే నిర్మించాలని సీఎం కేసీఆర్ మెట్రో అధికారులకు సూచించారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన సర్వే, రైట్ ఆఫ్ వే పనులు పురోగతిలో ఉన్నాయి. ఇప్పటికే చాంద్రాయణగుట్ట, సంతోష్‌నగర్, బహదూర్‌పుర, జూపార్కు ప్రాంతాల్లో ఫ్లై ఓవర్‌ల నిర్మాణం చేపట్టింది. ఇలా పాతబస్తీని సైతం అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నది.

# మానసిక ప్రశాంతతతో ఆరోగ్యం పదిలం

*బొటానికల్ గార్డెన్‌లో రన్ ఫర్ పీస్‌ను ప్రారంభించిన ఎంపీ సంతోష్ కుమార్*



మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ సంతోష్ కుమార్, విప్ అరెకపూడి గాంధీ, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి




బొటానికల్ గార్డెన్‌లో రన్ ఫర్ పీస్ రన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ సంతోష్‌కుమార్, విప్ గాంధీ, ప్రతాప్‌రెడ్డి

కొండాపూర్, అక్టోబర్ 2: మానసిక ప్రశాంతతతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీ సంతోష్ కుమార్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని కొత్తగూడ బొటానికల్ గార్డెన్స్‌లో బొటానికల్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రన్ ఫర్ పీస్' 10కే, 5కే, 3కే రన్‌లను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వ విప్ అరెకపూడి గాంధీ, ఎఫ్‌డీసీ చైర్మెన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి రోజు గంట పాటు వ్యాయామం చేయడంతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుస్తుందన్నారు. కొత్తగూడలోని బొటానిక్ గార్డెన్‌ను అన్యాక్రాంతం కాకుండా కాపాడిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనన్నారు. రాష్ట్రంలో థీమ్ పార్కుల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం గార్డెన్‌లో మొక్కలు నాటారు. రన్‌ను ప్రారంభించే ముందు మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రన్‌లో 2500 మంది ఔత్సాహికులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భరత్‌రెడ్డి, సభ్యులు చాంద్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.